క్లుప్తంగా

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శుక్రవారం బ్యాంకింగ్ రంగ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ జి.శాంతి మాట్లాడుతూ.. డీసీసీబీలో ఖాతాలు తెరవడం ఎలా.. అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు హదసా రాణి, రాజిరెడ్డి, అధ్యాపకులు, బ్యాంక్ సిబ్బంది స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా పాటించాలి

నేలకొండపల్లి: గురుకులంలో మెనూ కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆదేశించారు. మండలంలోని సింగారెడ్డిపాలెంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదులు, స్టోర్ రూమ్‌లు, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ట్రాలీ కార్మికుడి కుటుంబానికి..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న ట్రాలీ కార్మికుడు ఐతన బోయిన నాగేశ్వరరావు(57) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈమేరకు కార్మికుడి దహన సంస్కారాలు, కనీస అవసరాల నిమిత్తం ట్రాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నున్నా మాధవరావు ఆధ్వర్యాన ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలో మృతుడి భార్య లింగమ్మకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాలీ వర్కర్ యూనియన్ ప్రతినిధులు కొత్త సైదిరెడ్డి, ఎస్‌కే పాషా, బి.వీరబాబు, బి.వెంకన్న, డి.శంకర్, డి.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థినికి..

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డతండాకు చెందిన వడిత్య రమ్య జమ్మూలోని ఐఐటీలో సీటు సాధించగా.. ఆమె కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామా శ్రీను రూ.10వేలు సాయం అందించారు. శుక్రవారం ఈమేరకు శ్రీను సతీమణి రజిత, కుమారుడు మణిష్‌లు తహసీల్దార్ సురేష్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జర్పుల శ్రీనివాస్, రామా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ ధంసలాపురం సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ ఇన్‌చార్జ్ ఏఈ ఎండీ అబ్దుల్ ఖదీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సంభానినగర్, శ్రీరాంనగర్ రోడ్ నంబర్ 1 నుంచి 14 వరకు ధంసలాపురం ఓల్డ్, న్యూ కాలనీలు, సీతారాంపురం, కొత్తూరు, ఎస్‌బీఐటీ రోడ్, అబ్దుల్ కలాంనగర్, శ్రీకృష్ణానగర్, మాణిక్యనగర్, రామచంద్రయ్యనగర్, ముస్తాఫానగర్ సెంటర్, బోనకల్ క్రాస్ రోడ్, చెరువు బజార్, పార్శీబంధం, పాకబండ బజార్, ఏకలవ్యనగర్, అల్లీపురం రోడ్, బృందావనం కాలనీ, లోటస్, శ్రీరామ్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

సభ్యత్వ నమోదు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్)లో సభ్యులుగా చేరాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు అన్నారు. శుక్రవారం నగరంలోని విజ్ఞాన్ స్కూల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరిత, రమేష్, సురేష్, రమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థిని ప్రతిభ



యోగ్యశ్రీని అభినందిస్తున్న డైరెక్టర్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని పి.యోగ్యశ్రీ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ తెలంగాణ బోనాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి నాట్యమయూరిగా నిలిచిందని పాఠశాల డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. ఎన్నాళ్లీ పాట్లు!?

అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. ఆపై పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక కచ్చా కాల్వల్లో మురుగునీరు చేరి దోమలు, విష కీటకాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో డెంగీ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశుద్ధ్యంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోకపోవడంతో గత నెల రోజులుగా నగరంలో అపరిశుభ్రత పెరిగిపోయింది.



బ్యాంక్ కాలనీ ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

అపరిశుభ్ర స్థలాలతో బెంబేలు

- అడవులను తలపించేలా పిచ్చి మొక్కలు
- కాలనీల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం
- స్థలాల్లోకి చేరుతున్న మురుగునీరు
- దోమలు, విష కీటకాలకు ఆవాసాలుగా మారుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు



ద్వారకానగర్‌లో ఓ ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లలో సుమారు 5 లక్షల మందికి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి తటాకాలుగా మారడంతో పిచ్చి మొక్కలు పెరగడం, పందులు తిరగడం, ఇతర కీటకాలకు ఆవాసాలుగా మారాయి. నగరంలోని రాపర్తినగర్, రమణగుట్ట, శ్రీనివాసనగర్, ప్రకాశ్‌నగర్, బుర్హాన్‌పురం, బ్యాంక్‌కాలనీ, వీడీవోస్ కాలనీ, ద్వారకానగర్, బోనకల్‌రోడ్డుకు ఇరువైపుల, పంపింగ్‌వేల్ రోడ్డు, ప్రకాశ్‌నగర్, రామన్నపేట, దానవాయిగూడెం, విలీన పంచాయతీల్లోని పలు కాలనీల్లో అపరిశుభ్రత నెలకొంది.

పిచ్చి మొక్కలతో సమస్య..

ప్రతీ ఏటా వర్షాకాలం సీజన్‌లో ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారుతున్నాయి. వర్షాలు కురవగానే ఖాళీ స్థలాల్లోకి నీరు చేరి పిచ్చి మొక్కలు మొలవడం, లోతట్టు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమలు, విష కీటకాలతో కాలనీవాసులు ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. దీంతో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల యజమానులు, అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. విలీన పంచాయతీలు, నగర శివారు ప్రాంతాల్లో అయితే ఈ సమస్యను వర్ణించలేని విధంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పేరుకే నగరంలో నివాసం ఉంటున్నట్లు ఉందని, పల్లెల్లో ఉన్న శుభ్రత ఇక్కడ కనిపించడం లేదని ఆరోపణలు చేస్తున్నారు.



దోమలు బాబోయ్..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డెంగీ కేసులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. మలేరియా, ఇతర దోమలతో పాటు డెంగీ కారకమైన దోమల బెడద ఉన్నట్లు తెలుస్తోంది. పగటి పూట కుట్టే ఈ దోమ నిల్వ ఉన్న మంచి నీటిలో అంటే ఇళ్లు, ఇతర భవన సముదాయాలు, చిన్నచిన్న పాత్రలు, సంపులు, తదితర వాటిల్లో పెరుగుతుంది. నగరంలో ఈ నెలలో ఐదు డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక డెంగీతో పాటు ఇతర విష జ్వరాల ముప్పు పొంచి ఉందని, తక్షణమే నగరంలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి.

స్థల యజమానులకు జరిమానా..



ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించాం. శుభ్రం చేయించుకోని యజమానులకు ఫైన్ వేసి, ఆ స్థలాలను కేఎంసీ ఆధ్వర్యాన శుభ్రం చేయిస్తున్నాం. ఫైన్ కట్టకుంటే ఇంటి పర్మిషన్, రిజిస్ట్రేషన్ సమయాన అనుమతులు ఆపేలా చర్యలు తీసుకుంటాం. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– పునుకొల్లు నీరజ, కేఎంసీ మేయర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 21వ డివిజన్ అబ్దుల్‌కలాంనగర్‌లో నగర పాలక సంస్థ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం శంకుస్థాపన చేశారు. నగర అభివృద్ధిలో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీలను నిర్మించనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ ఆళ్ల నిరీష అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పారకుర్తి నాగేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ సతీష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్

'ప్రత్యేక' పాలనపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

కామేపల్లి: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బానోత్ సునీత అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈక్రమంలో ఎంఈఓ ప్రగతిపై వివరిస్తుండగా.. మద్దులపల్లి ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ మాట్లాడుతూ.. కొంతమంది ఉపాధ్యాయులు సమావేశాల పేరుతో బాధ్యతరహితంగా పని చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో ఎంఈఓ స్పందిస్తూ.. మండలంలోని రాయిగూడెం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఎక్కువగా ఉన్న మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లాలని ఆదేశించడంతో సదరు ఉపాధ్యాయుడు తన ఇంటికి వచ్చి తనను బెదిరిస్తున్నారని చెప్పాడని, దీంతో అతడిపై ఒత్తిడి చేసే పరిస్థితి లేకుండా ఉందన్నారు. అయినా సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీని ప్రజాప్రతినిధులు కోరారు. రుణమాఫీపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశానికి గైర్హాజరైన 8 శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ సుధాకర్, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి హేమమాలిని, మల్లెంపాటి నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ గబ్రూనాయక్

నివేదికలతోనే సరి..

నేలకొండపల్లి: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వజ్జా రమ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో శుక్రవారం అధికారులు నివేదికలతో ముగించారు. అయితే మండలంలోని సదాశివాపురం, కట్టుకాచారం, పైనంపల్లి గ్రామాల వద్ద నూతనంగా చెక్ డ్యాంలు మంజూరైనట్లు ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇమ్రాన్, మండల పంచాయతీ అధికారి శివ, విద్యుత్ ఏఈ కె.రామారావు, ఐసీడీఎస్ సీడీపీఓ బాలా త్రిపుర సుందరీ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, ఈజీఎస్ ఏపీఓ సునీత, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, వైద్యాధికారి గీత, ఏఓ అరుణకుమారి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడాలి

ఖమ్మంరూరల్: దోపిడీ వ్యవస్థ మార్పునకు స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గాదె ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన మహాసభలో ఆమె మాట్లాడారు. నిర్భయ చట్టం వచ్చినా మహిళలపై దుర్మార్గాలు ఆగడం లేదని, రెక్కలు ముక్కలు చేసుకుని పని చేసుకుంటున్న మహిళా కూలీలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొంటూ ర్యాలీ తీశారు. ఈ మహాసభల్లో నాయకురాళ్లు పి.లక్ష్మి, వై.జానకి, న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, శీలం సుదర్శన్, ఎ.శాంతి, కె.నర్మద, ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక శాఖలో భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు చేసుకున్న వారికి బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన కార్మికశాఖ సహాయ అధికారులు వెంగమాంబ, రమేష్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కార్మికుడి కుమార్తె వివాహం, ప్రసవాలు సమయాన బయోమెట్రిక్ పడక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో రోజుల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, పి.రాందాస్, పేరబోయిన వెంకన్న, గోసు పుల్లయ్య, ప్రభాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కార్గిల్ విజయ్ దివస్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి, న్యూవిజన్ పాఠశాల్లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాలలో డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, న్యూవిజన్‌లో అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీలు మాట్లాడుతూ.. వీర జవాన్లు పాకిస్థాన్‌తో జరిపిన కార్గిల్ పోరులో విజయం సాధించినందుకు గుర్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యా సంస్థల యాజమాన్యలతో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంచుకొండలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీకి వచ్చే లావాదేవీలు, గ్రామ సభ, పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహణ, నిధుల మంజూరు, వినియోగం వంటి అంశాలను గ్రామ కార్యదర్శి మధును అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో మరమ్మతులు జరుగుతున్న భవనాలను పరిశీలించి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరును అడిగి తెలుసుకున్నారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెం, మద్దులపల్లికి చెందిన పలువురికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సీపీఎం నాయకుడు యండపల్లి వెంకటరామయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న చెక్కులను కూడా జారీ చేయాలని కోరారు. నాయకులు గుర్రం చినవెంకన్న, జె.నాగేశ్వరరావు, రామగిరి నాగరాజు, రామయ్య, వెంకటేశ్వర్లు, పి.యాదగిరి, బ్రహ్మం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు..

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం పొంది ఇటీవల మృతి చెందిన ముగ్గురి కుటుంబ సభ్యులకు రూ.50 వేల చొప్పున మంజూరైన బీమా చెక్కులను డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జగదీష్, ఉపాధ్యక్షుడు కలకుంట్ల శ్రీను, సభ్యులు ఎడవల్లి తిరపయ్య, విజయభాస్కర్, చల్లగుండ్ల వెంకట్రామయ్య, కుక్కల సామేల్, గండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై సమీక్ష

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు ఈ ఏడాది చాలా మొక్కలు నాటాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈమేరకు గ్రామ పంచాయతీలవారీగా వన మహోత్సవం, హార్టికల్చర్ కింద ప్లాంటేషన్ చేసిన వివరాలు,ఇంకుడు గుంతల నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ పద్మయ్యనాయుడు, దీపక్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మోతారపు శ్రావణి

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమయూరిసెంటర్: పాఠశాల ఆవరణలో చెత్త కాగితాలు, మురుగు నీరు నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నగరంలోని యూపీఎస్ వేణుగోపాలనగర్ పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రపరిచి, బ్లీచింగ్ చేయించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈక్రమంలో ఈ పాఠశాలలో స్కోప్ ఆర్ఫ్ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ఆన్‌లైన్ ద్వారా బాలల అక్రమ రవాణా పెరిగినందున పిల్లలకు సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా 1930లకు ఫోన్ చేసి తక్షణ సాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్కోప్ ఆర్ఫ్ డైరెక్టర్ ఎంఎల్ ప్రసాద్, కోఆర్డినేటర్ కె.సుజాత, అరుణ, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు డి.లింగయ్య, పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు .

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కూసుమంచి: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, మాజీ సర్పంచ్ చాట్ల పరుశురామ్, కాంగ్రెస్ నాయకులు పెండ్ర అంజయ్య ఉన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక డ్రైవ్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ, 11వ డివిజన్లలో శుక్రవారంకార్పొరేటర్లు లకావత్ సైదులు, సరిపుడి రమాసతీష్ పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చెత్త తొలిగింపు, నిల్వ నీటిని తొలగింపు, దోమల నివారణకు చర్యలు స్థానికులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సతీష్, సరిపూడి వెంకటేశ్వర్లు, జవాన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్‌కాలనీ, ఎల్‌బీనగర్, గోపాలపురం తదితర కాలనీల్లో డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ సైదులు మేయర్ నీరజను కలిసి వినతిపత్రం అందించారు.

జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఖమ్మం సీనియర్ సిటిజెన్స్ సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వయోవృద్ధుల వసతి గృహ నిర్మాణం, నిధుల సేకరణ, నూతన కార్యవర్గం ఎన్నిక తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.జనార్దన్‌రావు, కొత్త సత్యనారాయణరెడ్డి, ఆర్.రవీందర్‌రావు, జి.సూర్యప్రకాశరావు, జె.వెంకటేశ్వర్లు, ఎ.రాధాకృష్ణ, శ్రీహరి, జి.నాగేశ్వరావు, బి.పుల్లారావు, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'రాయల' సంతాప సభ..

తిరుమలాయపాలెం: ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్రం కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి సంతాప సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు తిమ్మిడి హన్మంతరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన సంతాప సభల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు. మాస్‌లైన్ డివిజన్ నాయకులు కొత్తపల్లి వెంకటరెడ్డి, బానోత్ శంకర్, వెన్నబోయిన శ్రీనివాసరావు, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పసలాది వెంకన్న, వీరారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కూల్చిన భవనం పరిశీలన

ఖమ్మంగాంధీచౌక్: మున్సిపల్ శాఖ కూల్చిన ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం భవన శిథిలాలను ఆ శాఖ ఇంజనీరింగ్ బృందంతో పాటు ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు తెలంగాణ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయానికి చెందిన నలుగురు ఇంజీరింగ్ అధికారులు ఆ భవనం నిర్మాణంలో వినియోగించిన ఇనుము, కలప ను గుర్తించి వాటిని భద్రపరిచేలాప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వి.వీరభద్రస్వామి, ఇక్కడ నుంచి వరంగల్‌కు బదిలీ అయిన సూపరింటెండెంట్ రవికుమార్‌లు శిథిలాలను పరిశీలించారు. హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లోని ట్రైబల్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, రమేష్, రావత్ రాము, కృష్ణ రాథోడ్, దొడ్డా అరుణ, శ్రీనునాయక్, బాలాజీ, రామారావు పాల్గొన్నారు.

కూలీలకు ఏటా రూ.12 వేలు ఇవ్వాలి..

నేలకొండపల్లి: వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలను ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక రావెళ్ల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, దుగ్గి వెంకటేశ్వర్లు, మున్నంగి లక్ష్మి, మందడపు మురళీకృష్ణ, సామాల మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు..

అన్నం శ్రీనివాసరావుకు..



అన్నం శ్రీనివాసరావును సన్మానిస్తున్న కలెక్టర్

ఖమ్మంఅర్బన్: పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి సేవలు అందిస్తున్న అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన కార్గిల్ విజయదివస్ కార్యక్రమంలో అన్నం శ్రీనివాసరావును సన్మానించి సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయురాలికి..



నాగమణిని సన్మానిస్తున్న హెచ్‌ఎం విజయకుమారి

నేలకొండపల్లి: దాదాపు 11 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి బదిలీ అవుతున్న ఉపాధ్యాయురాలిని సన్మానించగా సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు భావోద్వాగానికి గురయ్యారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జి.నాగమణి వీడ్కోలు సన్మాన సభ శుక్రవారం ఏర్పాటుచేశారు. సుమారు 11ఏళ్లుగా ఆమె ఇక్కడ విధులు నిర్వర్తించి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని చెబుతూ హెచ్‌ఎం విజయకుమారి తన సొంత కుమార్తెను పంపిస్తున్నంత బాధగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. అలాగే, పలువురు విద్యార్థులు కంటతడి పెడుతూ టీచర్‌ను ఇదే పాఠశాలలో కొనసాగించాలని కోరారు. ఎంఈఓ బి.చలపతిరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రత్నకుమారి, షకీరాబేగం, సీఆర్‌పీ కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు టి.గురవయ్య, అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో టీవీ చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని పెదవెంకటగిరి ఉన్నత పాఠశాలలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం సాయంత్రం ఉపాధ్యాయులు యథావిధిగా పాఠశాలకు తాళం వేసి వెళ్లి శుక్రవారం ఉదయం వచ్చేసరికి హెచ్‌ఎం, వంట గదుల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో లోపల పరిశీలించగా రూ. 30వేలు విలువైన ఎల్‌ఈడీ టీవీ, రూ.6,500 విలువైన ఇతర సామగ్రి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

ఖమ్మంరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకే అనుకూలంగా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం , వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యపై బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించారని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పి.సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నండ్ర ప్రసాద్, పి.వెంకటరమణ, అద్దంకి తిరమలయ్య, మల్లయ్య, పాషా, భాస్కర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు